విద్యార్థినుల ధ్యేయం నైపుణ్యమే..



క్యాంపస్ డ్రైవ్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థినులు



గ్రూప్ డిస్కషన్‌లో విద్యార్థినులు

- మెరికల్లా తీర్చిదిద్దుతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ.. పీజీ కళాశాల
- ఉత్తమ రీతిలో కమ్యూనికేషన్ స్కిల్స్ బోధన
- క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మెరుస్తున్న కళాశాల విద్యార్థినులు

దాబాగార్డెన్స్: పాత జైల్‌రోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన జవహర్ నాలెడ్జి కేంద్రం విద్య–ఉపాధిని అనుసంధానిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. విద్యార్థుల్లో నైపుణ్యాల వెలికితీత, అభివృద్ధే లక్ష్యంగా జేకేసీ విద్యార్థినులకు దిక్సూచిగా నిలుస్తోంది. కళాశాలలో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. వారిని ఉద్యోగులుగా తీర్చిదిద్దుతూ.. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తోంది.

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో తర్ఫీదు..

జవహర్ నాలెడ్జి కేంద్రం విద్యార్థినులను కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ఉన్నతంగా తీర్చిదిద్దుతోంది. ముఖ్యంగా ఆంగ్ల సంభాషణ, భావవ్యక్తీకరణ వంటి అంశాల్లో మెలకువలు బోధిస్తోంది. దీనివల్ల విద్యార్థినులు వివిధ సంస్థలు నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో చక్కగా విజయం సాధిస్తున్నారు. భాషా నైపుణ్యం, కరెంట్ అఫైర్స్ వంటివి విద్యార్థినులకు బోధించడం ద్వారా వారు ఎటువంటి కాంపిటీటివ్ ఎగ్జామ్‌లో అయినా రాణించేలా తర్ఫీదు ఇస్తున్నారు.



జేకేసీ ద్వారా శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

విద్యార్థినులకు వరం.. జేకేసీ..

పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌తోనే రాణిస్తున్నారు. జేకేసీ అనేది విద్యార్థినులకు గొప్ప అవకాశం. విద్యా సంవత్సరం ముగిసిన నాటికి ఉపాధి రంగాల్లో స్థిరపడేలా అవసరమైన తర్ఫీదు ఇస్తున్నాం. ప్రధానంగా ఆంగ్లంలో మాట్లాడడంతో పాటు ఇంటర్వ్యూలు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తున్నాం. విద్యావంతులైన యువతకు ఉపాధి రంగాల్లో చాలా అవకాశాలున్నాయి.

– విద్యా కల్పన, జేకేసీ కో–ఆర్డినేటర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

భాషలపై అవగాహన..

కళాశాల జేకేసీ ల్యాబ్‌లో కొత్త కొత్త అవకాశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులకి భాషలపై అవగాహన పెంపొందింపజేస్తున్నారు. ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ఇంటర్వ్యూల్లో అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేటట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఆంగ్లంలో తర్ఫీదు ఇవ్వడం ద్వారా వారు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో చక్కటి నైపుణ్యం సముపార్జించుకునేలా తీర్చిదిద్దుతున్నారు.

– జి.ఎస్.ప్రత్యూష, బీఎస్సీ, ఎంబీసీ, కళాశాల పూర్వ విద్యార్థిని

ఎంతో మంది విద్యార్థులు స్థిరపడ్డారు..



ఎంతో మంది విద్యార్థులకి ఉద్యోగావకాశాలు కల్పించాం. జవహర్ నాలెడ్జి కేంద్రం విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచుతూ, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా పని చేస్తోంది. కళాశాలలో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ వారిని ఉద్యోగులుగా మారుస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేస్తోంది. – డాక్టర్ మంజుల, కళాశాల ప్రిన్సిపాల్

కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రావీణ్యం పొందా..

విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ డిగ్రీ పూర్తి చేశాను. కళాశాలలో ఉన్న జేకేసీ ద్వారా శిక్షణ పొందాను. శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌లో అవగాహన, మాట్లాడే విధానం, మెలకువలను కళాశాల ఇంగ్లీషు అధ్యాపకులు, జేకేసీ ద్వారా నేర్చుకున్నాను. ఫలితంగా జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఇండియన్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్‌కు ఎంపికయ్యా.

– సీహెచ్ రాజ్యలక్ష్మి, కళాశాల పూర్వ విద్యార్థిని

నేడు మంచినీటి సరఫరా విభాగం కార్మికుల టూల్ డౌన్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ వాటర్ సరఫరా విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికులు బుధవారం టూల్ డౌన్ (పని బంద్) చేసి నిరసన తెలపనున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు, ప్రధాన కార్యదర్శి రెల్లి సత్యం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ మంచి నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు కార్పొరేషన్ తీర్మానం మేరకు (2024 డిసెంబర్ 11, జీవో 7) వేతనాలు అమలు చేసేందుకు గత ఐదు నెలలుగా అప్కోస్ అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఈ ఏడాది మే నెల డ్యూటీ సర్టిఫికెట్లు సంబంధిత అధికారులకు ఇచ్చారని, ఆప్కోస్ వెబ్‌సైట్‌లో కొత్త వేతనాలు అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. గత నెల 24న ఆప్కోస్ పోర్టల్‌లో మొదటి థంబ్ వేసే ప్రక్రియ పూర్తయి, ఇన్వాయిస్ కూడా జెనరేట్ అయిందని, దానిని చూసి వాటర్ సరఫరా ఔట్ సోర్సింగ్ కార్మికులు సంతోషపడ్డారని తెలిపారు. ఇదిలా ఉండగా.. జనరేట్ అయిన మరుసటి రోజు నుంచి అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని, ఎవరో.. ఏదో చెప్పారని.. తిరిగి పాత వేతనాల బిల్లునే పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిన కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. జీవో 7 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరారు. లేనిచో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పని బంద్ చేసి నిరసన తెలపనున్నట్టు చెప్పారు. అధికారులు స్పందించకపోతే నిరవధిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు.

నేడు సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. వేకువ జాము 2 నుంచి 4 గంటల వరకు నిత్యారాధన, బాలభోగం, ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక వ్రతాలు, 12.30 నుంచి అన్న సమారాధన, 1 గంటకు పూర్ణాహుతి, ధ్వజావరోహణం, చక్రస్నానం, అవబృదం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు భక్తుల పూజలు



వాసు దంపతులకు అమ్మవారి ఫొటో అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు పందిమెట్టలో వేంచేసిన ముత్యాలమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. 29వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల వాసు దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు జరిపి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పీతల వాసుని సత్కరించి అమ్మవారి ఫొటో బహూకరించారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి వార్డు జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవంలో తనను భాగస్వామ్యం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

దొండపర్తిలో కూలిన చెట్టు



మండా వారివీధి పరిసరాల్లో కూలిన చెట్టు

అల్లిపురం: దొండపర్తి మండా వారి వీధి సమీపంలో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి చెట్టు కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ అటువైపు రాకపోవటంతో ప్రమాదం జరగకలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. చెట్టు పడిపోవడంతో రాకపోకలకు కొంత సేపు అంతరాయం కలిగింది.

బంధువులకు ఒడిశా వాసి మృతదేహం అప్పగింత

మహారాణిపేట: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయిన ఒడిశా వాసి వ్యవహారం సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి పోలీసు కమిషనర్ బాగ్చి దృష్టికి తీసుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం గంజామ్ జిల్లాకు చెందిన జి.లక్ష్మయ్య ఇంట్లో పడిపోయి గాయపడ్డాడు. చికిత్స కోసం పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లినా ఉపయోగం లేకపోవడంతో ఈనెల 8న కేజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం లక్ష్మయ్య చనిపోయాడు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. లక్ష్మయ్య కుటుంబ సభ్యులు మృతదేహం కోసం మార్చురీ వద్ద పడిగాపులు పడ్డారు. ఈ విషయంలో సీపీ బాగ్చి చొరవ తీసుకుని గంజామ్ పోలీసులతో మాట్లాడారు. అక్కడి నుంచి ఎలాంటి ఎంఎల్‌సీ కేసు నమోదు కాలేదని ఫ్యాక్స్ మెసేజ్ రావడంతో మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులు యోగాంధ్రలో పాల్గొనాలి

దాబాగార్డెన్స్: ఈ నెల 21న నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ పిలుపునిచ్చారు. గురజాడ కళాక్షేత్రంలో మంగళవారం జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎం సత్యవేణి నేతృత్వంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఎస్‌ఎల్‌ఎఫ్ రిసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సోషల్ వర్కర్లు, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇతర జిల్లా స్పెషల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, ఇతర ప్రజా ప్రతినిధులు, విశాఖ ప్రజలందరితో చేపట్టనున్న కార్యక్రమం విశాఖ చరిత్రలో నిలిచిపోనుందన్నారు.

వేడుకగా గంగమ్మ జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట: మత్స్యకారుల ఆరాధ్య దైవం గంగాదేవి పండగలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు, మత్స్యకార నాయకులు వాసుపల్లి గణేష్ కుమార్‌కు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. వాసుపల్లి ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్, ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం, విశాఖ డాల్ఫిన్ బోట్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గంగాదేవి వేడుకలకు తనని ఆహ్వానించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గంగమ్మ తల్లి కరుణతో కష్టాన్ని నమ్ముకుని బతికే తమ జాలర్లకు అమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వాసుపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు మైలపిల్లి లక్ష్మణరావు, నాయకులు పీసీహెచ్ అప్పారావు, మునం బాలాజీ, వైఎస్సార్‌సీపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, సెక్రటరీ ఆదివిష్ణు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండా రమణ, సౌత్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు సువార్త రాజు (బుజ్జి), సౌత్ యూత్ అధ్యక్షుడు తాడి రవి తేజ, యూత్ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, 37వ వార్డు నాయకుడు ఆకుల యేసు, అచ్యుత్, గంగాళ్ల రామరాజు, చింతకాయల వాసు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఇసుకపల్లి వాణిని బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రుపాకుల రవికుమార్, సీజీహెచ్‌ఎస్ లబ్ధిదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఏఎస్ రామం, అబిద్ హుస్సేన్, నగర బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ బి. భాగ్యలక్ష్మి, నగర బీజేపీ ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, పార్టీ నాయకులు చాట్ల బాబూరావు రెడ్డి, సుశీల, సంపత్ కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేజీహెచ్ అభివృద్ధికి కృషి చేస్తున్నాయని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కేజీహెచ్ అభివృద్ధికి ఆకుంఠిత దీక్షతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులంతా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అమ్మవార్ల జాతరకు వాసుపల్లి రూ.లక్ష విరాళం



నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: నగరంలోని 104 ఏరియాలో కొలువుదీరిన కుంచాలమ్మ, దుర్గాలమ్మ అమ్మవార్ల పండగకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం తన కార్యాలయంలో సొంత నిధుల నుంచి నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే అమ్మవారి జాతరకు వాసుపల్లి అందిస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలిపారు. దుర్గాదేవిని ఆరాధించడంలో వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రతి దసరా పండగకి 104 ఏరియాలో అమ్మవారిని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారన్నారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ అమ్మవార్ల కరుణా కటాక్షం విశాఖ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. వేలాది మంది భక్తులు ఇక్కడి అమ్మవార్లను తరచూ దర్శించుకుని మొక్కులు సమర్పిస్తారని, జాతర కూడా ఎంతో వైభవంగా నిర్వహిస్తారని వాసుపల్లి తెలిపారు.

ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



గరుడ పతాకానికి పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆవరణలో మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవంలో భాగంగా నవ గ్రహ మండపారాధన, మత్యుంజయ హోమం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో జీవీ రమాబాయ్, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం శ్రీ ఉమా చంద్ర మౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. పాల్గొనే భక్తులు ముందుగా తమ పేర్లు ఆలయంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

కళాశాలకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ బహూకరణ



ఫస్ట్ ఎయిడ్ కిట్ అందజేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: హిమా హ్యూమానిటేరియన్ అసోసియేషన్, ఒడిశా స్టీవ్‌డోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని ఎలియన్స్ కళాశాలకు బీపీ ఆపరేటర్, స్టెతస్కోప్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హిమా హ్యూమానిటేరియన అసోసియేషన్ చైర్మన్ బీఎస్ మూర్తి, వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్ మాట్లాడుతూ యువత జంక్ ఫుడ్స్ ఆరగించి రోగాల బారిన పడతున్నారని, ప్రమాదాలు జరిగినప్పుడు యువతకు అత్యవసర చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ చికిత్స బాక్స్ సామాజిక సేవా దృక్పథంతో అందజేసినట్టు చెప్పారు. త్వరలోనే విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల చైర్మన్ కొల్లా సతీష్‌కుమార్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చిన్న వయసు నుంచే ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ తీసుకుని, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ బంగు శ్రీనివాస్, హిమా అధ్యక్షుడు పుల మరిశెట్టి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు బీఏఎన్ నంద, ప్రభాత్, హరి, ఆర్.కిరీటి కుమార్, మజ్జి వెంకట్రావు, ఎలియన్స్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కాంట్రాక్ట్ కార్మికులతో ఎంప్లాయిమెంట్ సీనియార్టీ రా పని చేస్తున్న నిర్వాసిత కార్మికులను కూడా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగిస్తోందని వివరించారు. స్పందించిన ఎంపీ స్టీల్‌ప్లాంట్ సీఎండీతో పాటు డీపీతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పితాని భాస్కరరావు, ఉమ్మడి అప్పారావు, డీఎస్‌వీ నర్సింగరావు, బలిరెడ్డి సోమినాయుడు, గణేష్ పాల్గొన్నారు.

మంత్రి భరత్‌కు సత్కారం



మంత్రి భరత్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

దాబాగార్డెన్స్: విశాఖ విచ్చేసిన మంత్రి టీజీ భరత్‌ను పాతనగరం కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో పేదవారికి సహాయపడటంలో ఆర్యవైశ్యుల పాత్ర చెప్పుకోదగ్గది అన్నారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి దేవాలయ సంఘం అధ్యక్షుడు పెనుగొండ కామరాజు, ఆర్యవైశ్య ప్రముఖులు కంకటాల మల్లిక్, ఫైడా కృష్ణప్రసాద్, నేతి శ్రీనివాస్, కట్టమూరి సూర్యనారాయణ, దుర్గా నూకేశ్వరరావు, విన్నకోట రామ్మూర్తి, యలమర్తి గణేష్, బొడ్డు రఘు, దుర్గా సోమేశ్వరరావు, దోమా వెంకట బాలాజీకుమార్, కేఎంపీఎస్‌టీ రామకృష్ణ, సుగ్గు శివ, పాలూరి సురేష్‌కుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ ఉత్సవం



ప్రకాశరావుపేట చదునుపట్టు వద్ద బంగారమ్మ



వాసుపల్లికి స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు ప్రకాశరావుపేట, 28వ వార్డు భానోజీనగర్ గ్రామదేవత బంగారమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిసాయి. ఐదు రోజుల పాటు సాగిన ఉత్సవాలు మంగళవారం అనుపు మహోత్సవంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7 గంటలకు చదునుపట్టు వద్ద అమ్మవారి మేకపోతుకు శ్వాస ఎక్కించారు. అనంతరం బంగారమ్మను భక్తులు దర్శించుకున్నారు. 8 గంటలకు పోలమ్మ, ఎల్లమ్మ, బంగారమ్మలకు పసుపు, కుంకుమ అందజేశారు. 12 గంటలకు గ్రామ పురవీధుల్లో కూటి ఘటాలు తిరిగాయి. సాయంత్రం 4 నుంచి పురవీధుల్లో మంగళ వాయిద్యాలు, పులి వేషాలు, నేల వేషాలు, సేవ గరిడి, గంగాళమ్మ అమ్మవారు, తలకాయల అమ్మవారు, చంద్రమౌళీశ్వర బృందంచే కోలాటం వంటి కార్యక్రమాలతో ఊరేగింపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రకాశరావుపేట, భానోజీనగర్ ప్రాంత వాసులు సంయుక్తంగా నిర్వహించిన ఉత్సవాలకు దిబ్బలపాలెం, మహారాణిపేట, దండుబజార్, చాకలిపేట, గొల్లలపాలెం, కనకలవీధి, ఎల్లమ్మతోట, చందక వీధి, బొడ్డునాయుడుతోట, సూర్యాబాగ్ తదితర ప్రాంతాలతో పాటు నగరం నలు మూలల ఉన్న భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం భానోజీనగర్, ప్రకాశరావుపేట ప్రాంతాల్లో పూల ఘటాలు తిరిగాయి. అనుపు ఉత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశరావుపేట ఆలయం వద్ద పెద్ద ఎత్తున ప్రసాద వితరణ గావించారు. అలాగే భానోజీనగర్‌లో సామాజిక కార్యకర్త భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకాశరావుపేట బంగారమ్మ తల్లి గ్రామదేవత అమ్మవారి మహోత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి



స్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవబృదోత్సవం, చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లమారమ్మ ఉత్సవం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపలిలో నల్ల మారమ్మ ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా కొత్త కురపల్లి, పాత కురపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పాత కురపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు.